APBIL/26/A4072.

గోదావరి భవిష్యత్ వార్త

గోదావరి స్పెషల్ బులిటెన్

తెలుగు దినపత్రిక

సంపుటి : 1 | సంచిక : 73 | ఆగస్టు 03 | సోమవారం | 2026 | పేజీలు : 8 | వెల : 2 రూ.

యువరాజ్ సింగ్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ : టీమిండియా మాజీ స్టార్ ఆల్‌రౌండర్, ప్రపంచకప్ హీరో యువరాజ్ సింగ్ వ్యక్తిగత హక్కులు, గోప్యతకు భంగం కలిగించవద్దని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. యువీ అనుమతి లేకుండా అతడి పేరు, ఫొటోలు, గొంతును వాణిజ్య లేదా వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదని థర్డ్ పార్టీలను నియంత్రిస్తూ జస్టిస్ జ్యోతి సింగ్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో సృష్టించిన డీప్‌ఫేక్ వీడియోలు, వివాదాస్పద ఫొటోలు తన ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయని, టీషర్టులు, ఇతర వస్తువులపై తన పేరును అక్రమంగా వాడుకుంటూ వ్యాపారం చేస్తున్నారని యువరాజ్ హైకోర్టును ఆశ్రయించాడు. ఇతర క్రీడాకారులపై దాడి చేస్తున్నట్లు, మతపరమైన భావాలను దెబ్బతీసేలా, అసభ్యకరమైన భాషతో కూడిన డీప్‌ఫేక్ కంటెంట్‌ను సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్నారని అతడి తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

ఆగస్టు 5న సీజేపీ కీలక సమావేశం

నీట్ ప్రశ్నపత్రం లీక్ అంశంపై ఆందోళనలతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సీజేపీ సంస్థ ఆగస్టు 5న కీలక సమావేశాన్ని నిర్వహించనుంది. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో వ్యవస్థాపకుడు అభిజిత్ నివాసంలో కోర్ కమిటీ సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించనుంది గత నెల రోజులుగా చేపట్టిన ఉద్యమంపై సమీక్షతో పాటు, ఇకపై అనుసరించాల్సిన వ్యూహంపై నిర్ణయాలను కూడా ఈ సమావేశంలో తీసుకోనున్నారు. రాష్ట్రాల వారీగా విద్యార్థులు, వాలంటీర్లు, కార్యకర్తల నుంచి సేకరించిన అభిప్రాయాలు, సూచనలను కూడా కోర్ కమిటీ చర్చించనుంది. అనంతరం మీడియా సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణను అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం. తదుపరి దశలో చేపట్టే ఉద్యమాలు, కార్యక్రమాలపై కూడా స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది

ఇండోనేషియాలో ఘోర అగ్నిప్రమాదం

ఐదుగురి మృతి, 41 మంది గల్లంతు..

జకార్తా: ఇండోనేషియాలోని మదురా ద్వీపం సమీపంలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. ఆదివారం సముద్రంలో ప్రయాణిస్తున్న ఓ ఫెర్రీలో ఒక్కసారిగా మంటలు చెలరేగి ఐదుగురు మృతిచెందగా.. 41 మంది గల్లంతయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో ఫెర్రీలో మొత్తం 271 మంది ప్రయాణికులు ఉన్నట్లు స్థానిక అధికారులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని రక్షణ చర్యలు చేపట్టాయి. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతుండగా.. మరికొందరిని సురక్షితంగా కాపాడారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇండోనేషియాలోని రెండో అతిపెద్ద నగరమైన తూర్పు జావాలోని సురబయ నుంచి దక్షిణ సులవేసిలోని మకాస్సర్‌కు వెళ్తుండగా ఈ అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదానికి గురైన ఫెర్రీని ముతియారా సంతోసా-2గా అధికారులు గుర్తించారు. సహాయక చర్యల కోసం తొమ్మిది నౌకలను ఘటనాస్థలికి పంపించారు. నౌకకు నిప్పంటుకున్న వెంటనే భారీగా పొగలు వ్యాపించాయి. దీనికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు నిమిషాల వ్యవధిలోనే సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మంటల నుంచి ప్రాణాలను కాపాడుకునేందుకు కొందరు ప్రయాణికులు ఫెర్రీ నుంచి సముద్రంలోకి దూకిన దృశ్యాలు కలవరపెడుతున్నాయి. అయితే, ఈ ప్రమాదానికి గల కారణాలపై అధికారులు ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

లారీని ఢీకొట్టిన కారు

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు సహా ఐదుగురి మృతి..

కోయంబత్తూరు: తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆగి ఉన్న లారీని ఓ కారు వేగంగా ఢీకొనడంతో ఐదుగురు మృతిచెందారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉండటం విషాదాన్ని నింపింది. ఆదివారం మధ్యాహ్నం పొల్లాచ్చి-పళని జాతీయ రహదారిపై నల్లంపల్లి జంక్షన్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. అతివేగమే ప్రమాదానికి ప్రధాన కారణమై ఉండొచ్చని స్థానిక అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారిని కోయంబత్తూరు జిల్లా మదుక్కరై సమీపంలోని గురుబంపాలయం ప్రాంతానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. మృతులను కనగరాజ్, ఆయన భార్య నర్మద, వారి కుమార్తెలు ఆర్తి, పూరణిగా తెలిపారు. అయితే, ఈ ఘటనలో మరణించిన ఐదో వ్యక్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు. ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు వెల్లడించారు. కాగా, ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి దారితీసిన కారణాలపై దర్యాప్తు చేపట్టారు. మరోవైపు, ఒకే కుటుంబానికి చెందిన నలుగురు చనిపోవడంతో బంధువులు, స్వగ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

నషా ముక్త్ యువ' కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రధాని

యువతకు డ్రగ్స్ పీడ వదిలించే దిశగా ప్రధాని నరేంద్ర మోదీ నషా ముక్త యువ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా యువతలో స్ఫూర్తి నింపేందుకు ఒక సమగ్ర ప్రచారకార్యక్రమంగా 'నషా ముక్త యువ'ను ప్రారంభించామని ప్రధాని తెలిపారు. తాముంటున్న ప్రాంతాల్లో సానుకూల మార్పులకు కారకులుగా యువత నిలవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చామని ప్రధాని చెప్పారు. 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాకారం చేసుకునేందుకు దేశ యువత ఆరోగ్యంగా ఉండటం అవసరమని ప్రధాని అన్నారు. ఈ కార్యక్రమం వ్యక్తులకే కాకుండా కుటుంబాలు, దేశ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని రూపొందించామని అన్నారు. గతేడాది కాశీలో పైలట్ ప్రాజెక్టుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయాన్ని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇది దేశవ్యాప్తంగా అమలయ్యే స్థాయికి విస్తరించిందని చెప్పారు. ఈ క్యాంపెయిన్‌లో 125 ఆధ్యాత్మిక సంస్థలు కూడా చేరాయని చెప్పారు. డ్రగ్స్ రహిత సమాజం దిశగా కృషి చేస్తున్నాయని అన్నారు. 'కొన్ని పనులను పూర్తి చేసేందుకు ఒక వ్యక్తి సామర్థ్యం సరిపోదు. ఇలాంటి విషయాల్లో ఒంటరిపోరాటంతో అలసట, నిస్పృహ ఆవరిస్తాయి. కానీ అనేక మంది కలికట్టుగా రంగంలోకి దిగితే ఆ ఐక్యత నుంచి స్ఫూర్తి పొంది లక్ష్యాన్ని సాధించవచ్చు' అని ప్రధాని అన్నారు. ఇప్పటికే లక్షలాది మంది యువత ఇక డ్రగ్స్ జోలికి వెళ్లబోమని ప్రతినబూనారని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్‌తో కలిగే ముప్పు పై ప్రచార కార్యక్రమాలను దేశవ్యాప్తంగా ప్రతి ఆదివారం నిర్వహించనున్నారు.

కరెంటు స్తంభాలు ఉండవు.. తీగలు అసలే కనిపించవు!

దేశంలోనే తొలి 'పోల్-ఫ్రీ' నగరంగా అమరావతి రాజధాని

రాజధాని అమరావతి పనులు చకచకగా సాగుతున్నాయి. 2028 నాటికి రాజధాని తొలిదశ పనులు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా ప్రకటించారు. ప్రస్తుతం రాజధానికి రాజమార్గమైన సీడ్ యాక్సెస్ రోడ్డుతోపాటు అంతర్గత రహదారుల నిర్మాణాలు శరవేగంగా చేస్తున్నారు. ఇదే సమయంలో ఐకానిక్ టవర్స్ నిర్మాణాలు, ఇతర ప్రభుత్వ భవనాల పనులు వరుగులు తీయిస్తున్నాయి. అయితే వీటికి సమాంతరంగా అమరావతికి అంతర్జాతీయ స్థాయి నగరంలో తీర్చిదిద్దేలా ప్రభుత్వం పోల్ ఫ్రీ కేపిటల్ గా మార్చుతోంది. దేశంలో ఏ ఇతర నగరాల్లో లేనట్లు భూగర్భ కేబుల్ వ్యవస్థ ద్వారా అమరావతికి ఒక అధునాతన నగరంగా ప్రభుత్వం నిర్మిస్తోంది. మన దేశంలోని ఏ నగరంలో చూసినా కళ్లకు కనిపించే ఒకే ఒక సాధారణ దృశ్యం రోడ్ల వెంబడి వేలాడే విద్యుత్ తీగలు, ఇంటర్నెట్ కేబుల్స్, ప్రమాదకరమైన కరెంట్ పోల్స్. అయితే రాజధాని అమరావతిలో ఇలాంటి దృశ్యాలు కనిపించకుండా ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతోందని చెబుతున్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా 'పోల్-ఫ్రీ'), ఓవర్ హెడ్ కేబుల్స్-రహిత నగరంగా అమరావతి రూపుదిద్దుకుంటోందని ప్రభుత్వ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఇది భవిష్యత్ తరాల కోసం తలపెట్టిన ఒక అద్భుతమైన అర్బన్ ఇంజనీరింగ్ విప్లవంగా చెబుతున్నారు. దేశంలోని నగరాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో విద్యుత్ అంతరాయాలు, వర్షాకాలంలో మునిగిపోయే రహదారులు, ప్రతిసారీ కేబుల్స్, పైప్‌లైన్ల కోసం రోడ్లను తవ్వడం వంటివి ప్రధానమైనవి. ఈ సమస్యలన్నింటికీ అమరావతి మాస్టర్ ప్లాన్ అత్యంత శాశ్వతమైన, శాస్త్రీయమైన పరిష్కారాన్ని చూపుతోందని అంటున్నారు. అంతర్జాతీయ స్థాయిలో సింగపూర్, టోక్యో, దుబాయ్ వంటి నగరాలు అనుసరిస్తున్న అత్యాధునిక మౌలిక వసతుల విధానాన్ని అమరావతిలో అమలు చేస్తున్నారు. ముఖ్యంగా నగర సౌందర్యానికి ఎటువంటి భంగం కలగకుండా, పర్యావరణ హితంగా, అత్యంత సురక్షితమైన వాతావరణంలో ఈ రాజధాని నిర్మాణం సాగుతోంది. పోల్-ఫ్రీ, అండర్‌గ్రౌండ్ యుటిలిటీస్ ప్రత్యేకతలు సాధారణ నగరాల్లో విద్యుత్ సరఫరా, టెలిఫోన్, ఇంటర్నెట్ కేబుల్స్ అన్నీ రోడ్ల వెంట పెద్ద పెద్ద పోల్స్ మీద వేలాడుతూ ఉంటాయి. దీనివల్ల నగర సౌందర్యమే కాకుండా, ఈదురు గాలులు, తుఫానులు వచ్చినప్పుడు విద్యుత్ వ్యవస్థ క్షణాల్లో అస్తవ్యస్తమవుతుంది. కానీ అమరావతిలో ఈ సమస్య తలెత్తకుండా ముందుజాగ్రత్తలు తీసుకుంటున్నారు. అత్యుత్తమ అండర్‌గ్రౌండ్ టెక్నాలజీని వాడుతున్నారు. తుఫానులు, ఈదురుగాలులు, భారీ వర్షాల వల్ల విద్యుత్ అంతరాయం కలగకుండా హై-టెన్షన్ పవర్ లైన్స్ సహా అన్ని విద్యుత్ కేబుల్స్‌ను భూగర్భంలో అత్యంత పటిష్టంగా అమర్చుతున్నారు. రోడ్ల పక్కన డ్రైనేజీ కాలువలకు ఆనుకుని సుమారు 700 కి.మీ. మేర భూగర్భ డక్ట్‌లను నిర్మిస్తున్నారు. ఇందులో విద్యుత్, టెలిఫోన్, ఇంటర్నెట్, గ్యాస్ పైప్‌లైన్లు అన్నీ ఒకే వ్యవస్థలో భూమిలో ఉంటాయి. ఏదైనా కొత్త కేబుల్ వేయాలన్నా లేదా రిపేర్ చేయాలన్నా మళ్లీ రోడ్లు తవ్వాల్సిన అవసరం లేకుండా ప్రత్యేకమైన వాకింగ్ టన్నెల్స్, డక్ట్‌ల ద్వారా ఇంజనీర్లు నేరుగా లోపలికి వెళ్లి పనులు చేసుకునేలా రూపకల్పన చేశారు. ూశ్రీంశీ =ష్ణఽ - 'దేవుడిపై యుద్ధం' పేరుతో ఉరి.. ఇరాన్‌లో కన్నీటిపర్యంతమైన మరో ప్రాణం! బ్లూ-గ్రీన్ కాన్సెప్ట్, డిజాస్టర్-ప్రూఫ్ టెక్నాలజీ అమరావతి మాస్టర్ ప్లాన్ పూర్తిగా బ్లూ-గ్రీన్ కాన్సెప్ట్ ఆధారంగా రూపొందించారు. కృష్ణా నది తీరాన రూపుదిద్దుకుంటున్న ఈ రాజధానిలో పర్యావరణ పరిరక్షణకు, నీటి నిర్వహణకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. నగరంలో ప్రతి చుక్క నీటిని సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు ఉన్నాయి. నగరంలో వర్షపు నీరు ఎక్కడా నిలవకుండా అత్యాధునిక స్టార్మ్‌వాటర్ డ్రైన్స్, తాగునీటి సరఫరా కోసం 24/7 పైప్‌లైన్లు, రీ-యూజ్డ్ వాటర్ లైన్లు, అత్యాధునిక సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటవుతున్నాయి. దీనివల్ల అమరావతి కేవలం అందమైన నగరంగానే కాకుండా, ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా తట్టుకునే 'డిజాస్టర్-ప్రూఫ్' రాజధానిగా నిలుస్తోంది. ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల భాగస్వామ్యంతో రూ. 11,467 కోట్ల భారీ నిధులతో ఈ మౌలిక వసతుల నిర్మాణం వేగంగా సాగుతోంది. ఏపీసీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. విద్యుత్ పోల్స్ లేని, తీగల చిక్కులు లేని, పచ్చని చెట్లతో, అండర్‌గ్రౌండ్ టెక్నాలజీతో రూపుదిద్దుకుంటున్న అమరావతి దేశ భవిష్యత్ పట్టణాభివృద్ధికి ఒక సరికొత్త దిశానిర్దేశంగా వ్యాఖ్యానిస్తున్నారు. దశాబ్దాల తరబడి మన దేశం ఎదుర్కొంటున్న నగర నిర్మాణ సవాళ్లకు సమాధానం చెబుతూ, గ్లోబల్ సిటీగా అమరావతి రూపాంతరం చెందుతుందని ప్రభుత్వ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

చంద్రబాబు సీక్రెట్ అదే.. పిఠాపురం వర్మ విషయంలో బయటపెట్టిన సీఎం

రాజకీయాల్లో పదవులు వస్తుంటాయి పోతుంటాయి.. కానీ నాయకులకు, అధిష్టానానికి మధ్య ఉండే మానవతా సంబంధాలే పార్టీని చిరకాలం నిలబెడతాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఈ విషయంలో అధికార టీడీపీకి ప్రత్యేకమైన చరిత్ర ఉందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. పార్టీ నేతల పనితీరుతోపాటు వ్యక్తిగత క్రమశిక్షణను అనుక్షణం పర్యవేక్షించడం తెలుగుదేశం పార్టీకి మాత్రమే ప్రత్యేకం అంటున్నారు. ఈ విషయంలో కార్యకర్త నుంచి అధినేత వరకు ఎవరైనా ఒకటే అంటున్నారు. ఇదే సమయంలో నాయకులతో వ్యక్తిగత అనుబంధంపై కూడా పార్టీ పెద్దలు ఎక్కువ ఫోకస్ చేస్తుంటారని అంటున్నారు. దీంతో టీడీపీలో ప్రతి నేత కూడా పార్టీ తన సొంత ఆస్తిగా భావిస్తారని చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా తనకు ఎదురైన మాజీ ఎమ్మెల్యే వర్మను సీఎం చంద్రబాబు ఆత్మీయంగా పలకరించారని చెబుతున్నారు. అంతేకాకుండా ఇద్దరూ కలిసి నవ్వుతూ ఫొటోలకు ఫోజు ఇచ్చారు. పార్టీకి చెందిన నేతలతో అధినేత ఇలా ఫొటోలు దిగడం సాధారణమే అయినప్పటికి మాజీ ఎమ్మెల్యే వర్మ విషయంలో మాత్రం చాలా ప్రత్యేకంగానే చూడాలని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కోసం తన ఎమ్మెల్యే టికెట్ ను త్యాగం చేసిన మాజీ ఎమ్మెల్యే వర్మ రెండేళ్లుగా నామినేటెడ్ పదవి కోసం ఎదురుచూస్తున్నారు. 2019 ఎన్నికల తర్వాత పిఠాపురంలో తెలుగుదేశం పార్టీని కాపాడుకోవడానికి వర్మ తీవ్రంగా కష్టపడ్డారు. చాలా వరకు డబ్బు కూడా ఖర్చుపెట్టారు. ఎన్నికల సమయంలో జనసేన అధినేత పవన్ ఆ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానంటే మాజీ ఎమ్మెల్యే వర్మ తన సీటును త్యాగం చేశారు. ఈ సమయంలో ఆయనకు నామినేటెడ్ పదవి ఇస్తామని అధిష్టానంతో పాటు జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కూడా హామీ ఇచ్చారు. ఇక ఎన్నికల్లో పవన్ గెలిచిన తర్వాత సీన్ మారిపోయింది. ఎన్నికలు ముగిసి రెండేళ్లు అవుతుండగా, పిఠాపురంలో జనసేన-టీడీపీ సంబంధాలు దెబ్బతిన్నాయని అంటున్నారు. ఇరుపార్టీల నేతలు ఎవరికి వారు మనుగడ కోసం సొంతంగా పనిచేయడంతో కూటమి ఐక్యతపై అనేక అనుమానాలు తలెత్తాయి. అయితే, ఈ పరిస్థితిపై ఆందోళన చెందిన తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే వర్మను పార్టీ పదవి నుంచి తప్పించింది. సహజంగా ఇటువంటి పరిస్థితి ఎదురైతే ఏ నేత అయినా అవమానకరంగా భావిస్తారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కానీ, మాజీ ఎమ్మెల్యే వర్మ మాత్రం తనను పక్కన పెట్టిన అధిష్టానం చర్యతో బాధపడినప్పటికీ అది తమ పార్టీ అంతర్గత విషయంగా సర్దుకు పోయారు. దీంతోనే అధిష్టానం కూడా ఆయన విషయంలో తీవ్ర తర్జనభర్జనకు గురవుతోందని అంటున్నారు. **(తరువాయి 2వ పేజీలో)**

ఏపీ - ఆస్ట్రేలియా మధ్య కుదిరిన నాలుగు ఎంఓయూలు

అమరావతి : ఆంధ్రప్రదేశ్ - ఆస్ట్రేలియాల మధ్య నాలుగు ఎంఓయూలు కుదిరాయి. ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియా మంత్రి జూలియన్ హిల్ సమక్షంలో ఎంఓయూలను కుదుర్చుకున్నారు. క్లీన్ ఎనర్జీ, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ రంగాల్లో ఈ ఒప్పందాలు చేసుకున్నారు. విద్యా, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ఏపీ - ఆస్ట్రేలియా మధ్య ఈ ఒప్పందాలు జరిగినట్లు లోకేశ్ తెలిపారు. IIT తిరుపతిలో సోలార్ తయారీ రంగంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా లోకేశ్ పోస్టు పెట్టారు. ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్యా, అంతర్జాతీయ అభివృద్ధి, బహుళ సాంస్కృతిక వ్యవహారాల సహాయ మంత్రి జూలియన్ హిల్‌కి స్వాగతం పలకడం చాలా ఆనందంగా ఉందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. గత సంవత్సరం తన ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా జరిగిన ఫలవంతమైన చర్చల ఫలితంగా, స్వచ్ఛ ఇంధనం, అధునాతన తయారీ, సమ్మిళిత విద్య, విద్యార్థుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో నాలుగు వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశామని వెల్లడించారు. ఈ ఎంఓయూల ద్వారా తమ ఉద్దేశాన్ని ఆచరణలోకి తీసుకువచ్చామని చెప్పుకొచ్చారు. ఈ అవగాహన ఒప్పంద ఆవిష్కరణ, ప్రతిభ, ఉమ్మడి శ్రేయస్సుపై నిర్మించిన బలమైన ఆంధ్రప్రదేశ్ - ఆస్ట్రేలియా భాగస్వామ్యానికి నాంది పలుకుతుందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

క్షమించి నా కూతురికి జీవనదానం చేశారు

ప్రధాని మోదీకి బాలిక తల్లి కృతజ్ఞతలు..

ఢిల్లీలోని ఇటీవలి నిరసన కార్యక్రమంలో ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియో వైరల్ కావడంతో సదరు బాలికపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు అయింది. అనంతరం ఆమె వీడియో ద్వారా క్షమాపణలు చెబుతూ, తాను చేసిన తప్పును అంగీకరించింది. ఇకపై ఇలాంటి పొరపాటు చేయనని హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో తాజాగా బాలిక తల్లి మీడియాతో మాట్లాడారు 'ప్రధాని మోదీ ఎంతో పెద్ద మనసుతో మా కుమార్తెను క్షమించారు. ఆయన చూపిన కరుణను జీవితాంతం మర్చిపోలేం. మా కూతురికి కొత్త జీవితం ఇచ్చినట్లే' అని అన్నారు. తన కుమార్తెపై నమోదైన జీరో ఎఫ్ఐఆర్‌ను కూడా ఉపసంహరించుకోవాలని ఆమె పోలీసులను కోరారు. ఎఫ్ఐఆర్‌లో తన కుమార్తె పేరు, వయస్సు వంటి వివరాలు కూడా సరిగా నమోదు కాలేదని తెలిపారు కాగా, తనపై, తన తల్లిపై అసభ్య పదజాలం ఉపయోగించిన విద్యార్థులను శిక్షించడం కంటే వారిని సరైన మార్గంలో నడిపించడం ముఖ్యమని ఇటీవల ప్రధాని మోదీ పేర్కొన్నారు. వారిని కోర్టుల చుట్టూ తిప్పడం వల్ల ప్రయోజనం లేదని, వారు దారి తప్పిన పిల్లలని భావించి క్షమించాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు.

అభిషేక్ శర్మ సిక్సర్ల తుఫాన్.. 91 బంతుల్లో 233 పరుగులు

అంతర్జాతీయ క్రికెట్‌లో కొంతకాలంగా పరుగుల కోసం తంటాలుపడుతున్న టీమిండియా యంగ్ ఓపెనర్, డాషింగ్ హిట్టర్ అభిషేక్ శర్మ తిరిగి ఫామ్‌ను అందుకుని ఆకాశమే హద్దుగా చెలరేగాడు. పంజాబ్ అంతర్ జిల్లాల సీనియర్ టోర్నీలో అమృత్‌సర్ జట్టు తరఫున బరిలోకి దిగిన ఈ ఎడమచేతి వాటం బ్యాటర్.. తరన్ తారన్ జట్టుపై విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 91 బంతుల్లోనే 15 ఫోర్లు, ఏకంగా 25 సిక్సర్ల సాయంతో 256.04 స్ట్రైక్ రేట్‌తో 233 పరుగులు బాది డబుల్ సెంచరీ నమోదు చేశాడు. దీనికి సంబంధించిన స్కోర్‌కార్డ్, అభిషేక్ సిక్సర్ల వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఇటీవల కాలంలో అభిషేక్ శర్మ టీమిండియా తరఫున వరుసగా విఫలమయ్యాడు. జింబాబ్వే పర్యటనలో ఈ డాషింగ్ బ్యాటర్ తీవ్రంగా నిరాశపరిచాడు. 3 ఇన్నింగ్స్‌లలో కలిపి కేవలం 11 పరుగులు మాత్రమే చేసి, సగటున 3.66తో దారుణ ప్రదర్శన కనబరిచాడు. ముజరబానీ బౌలింగ్‌లో ఆఫ్ స్టంప్‌కు వెలుపల వచ్చే బంతులను అంచనా వేయలేక వరుసగా మూడు మ్యాచ్‌ల్లోనూ వికెట్ సమర్పించుకున్నాడు. అంతకుముందు ఇంగ్లండ్, ఐర్లాండ్ సిరీస్‌లలోనూ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. గత 10 అంతర్జాతీయ ు20 ఇన్నింగ్స్‌లలో కేవలం ఒకే ఒక్క అర్ధసెంచరీ మాత్రమే సాధించిన అభిషేక్.. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో నంబర్1 స్థానం నుంచి 3వ స్థానానికి పడిపోయాడు. అంతర్జాతీయ స్థాయిలో ఆఫ్ స్టంప్ అవతలి బంతులతో ఇబ్బంది పడుతూ, క్రీజులో అసౌకర్యంగా కనిపించిన అభిషేక్ శర్మ.. ఈ సుడిగాలి ఇన్నింగ్స్‌తో మళ్లీ తనపై తనకు పూర్తి ఆత్మవిశ్వాసాన్ని నింపుకున్నాడు. ఈ డబుల్ సెంచరీ ఫామ్ రాబోయే అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో ఆయనకు ఎంతో ఊరటనిచ్చే అంశమని క్రికెట్ నిపుణులు అన్నారు.

చంద్రబాబు సీక్రెట్ అదే.. పిఠాపురం వర్మ విషయంలో బయటపెట్టిన సీఎం

(1వ పేజీ తరువాయి) ఇందుకే మాజీ ఎమ్మెల్యే వర్మ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా సానుకూలంగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభం సందర్భంగా చాలా మంది నేతలు వచ్చినప్పటికీ మాజీ ఎమ్మెల్యే వర్మను మాత్రం ప్రత్యేకంగా పలకరించి తన ఆత్మీయతను సీఎం ప్రదర్శించారని చెబుతున్నారు. ఈ చర్య వర్మ ఒక్కరికే కాకుండా తెలుగుదేశం పార్టీలో మానవ విలువలకు ఇచ్చే గౌరవంగా చెబుతున్నారు. కూటమి పటిష్టంగా ఉన్న ఈ దిశలో ఉప ముఖ్యమంత్రితో రాజకీయ బంధం కోరుకుంటూనే వర్మను దూరం చేసుకోకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రదర్శిస్తున్న రాజకీయ, వ్యక్తిగత అనుబంధాలు హాట్ టాపిక్ అవుతున్నాయని అంటున్నారు.

గోదావరి జలాలతో ఏలేరుకు జీవం

- జగ్గంపేట, పిఠాపురంలో 53 వేల ఎకరాలకు సాగునీరు విడుదల -
రైతుల్లో సంబరాలు... ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేటఆగస్టు 2 జి ఎస్ బి వార్త : జగ్గంపేట, పిఠాపురం నియోజకవర్గాల్లోని 53 వేల ఎకరాల ఆయకట్టుకు గోదావరి జలాలు చేరాయి. గోదావరి ఎడమ కాలువ ప్యాకేజీ-3 నుంచి ఏలేరు ప్రధాన కాలువకు అనుసంధానం చేసి కిర్లంపూడి, పెద్దాపురం, గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లోని బ్రాంచ్ కెనాల్‌లకు ఆదివారం సాగునీటిని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, డిసిసిబి బ్యాంక్ చైర్మన్ తుమ్మల బాబు విడుదల చేశారు. కిర్లంపూడి మండలం కృష్ణవరం వద్ద గోదావరి తల్లికి, ఏలేరు కాలువకు ప్రత్యేక పూజలు, హారతులు ఇచ్చిన తర్వాత నీటి విడుదల ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ సూపర్ ఏలినో ప్రభావంతో రైతులు పడుతున్న నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అత్యవసర చర్యలు తీసుకున్నారు.

– పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా 1400 క్యూసెక్కుల గోదావరి జలాలను ఏలేరు ప్రాజెక్టులోకి లిఫ్ట్ చేస్తున్నారు. – కృష్ణవరం వద్ద పోలవరం కాలువ నుంచి అదనంగా 750 క్యూసెక్కుల నీటిని ఏలేరు ఆయకట్టు, పిఠాపురం బ్రాంచ్ కెనాల్‌కు విడుదల చేశారు. – దీనితో జగ్గంపేట, పిఠాపురం ప్రాంతాల్లోని 53 వేల ఎకరాలకు సకాలంలో నీరు అందుతుందని వరి, ఉద్యానవన పంటల దిగుబడి పెరిగే అవకాశం ఉంది. ఏలేరు పరివాహక రైతులు ఎదుర్కొంటున్న సమస్యను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఆయన నీటి సంఘాల ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించి నీటి విడుదలకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. పోలవరం–ఏలేరు కాలువ అనుసంధానం పూర్తయితే పిఠాపురం, జగ్గంపేట ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరు అందుతుందని చెప్పారు. రైతు బాగుంటేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, వ్యవసాయమే అభివృద్ధికి వెన్నెముక అని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని పవన్ కళ్యాణ్ కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి, కాలువల ఆధునీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టిందని జ్యోతుల నెహ్రూ అన్నారు.

గరగలంపాలెంలో ఘనంగా కంబాల కానుక
వనితల వేడుక... 400 పట్టు చీరలు పంపిణీ..

కోరుకొండ ఆగస్టు2 (జి ఎస్ బి వార్త) : రాజానగరం నియోజకవర్గం, కోరుకొండ మండలం గరగలంపాలెం గ్రామంలో శనివారం రాత్రి కంబాల కానుక వనితల వేడుక పట్టు చీరలు పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.గ్రామానికి విచ్చేసిన ఆయనకు తొలిత గ్రామ మహిళలు హరతులతో స్వాగతం పలికారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, యువత, అభిమానులు ఘన స్వాగతం పలికి, పూలమాలలతో సత్కరించారు.గ్రామంలో ఆలయాలను దర్శించుకుని, పూజలు నిర్వహించి, గ్రామ దేవతలకు తొలి చీరలను సమర్పించారు.ఈ కార్యక్రమానికి కులమతాలకు అతీతంగా మహిళలు తరలివచ్చారు.అనంతరం 400 మంది మహిళలకు, కంబాల శ్రీనివాసరావు గారు ఉచితంగా పట్టు చీరలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు, అభిమానులు, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

సామర్లకోట, ఆగస్టు 2, జి ఎస్ బి వార్త : ప్రభుత్వ విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతరిస్తుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దోమ తెరలు పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల నిమ్మకాయల చినరాజప్ప చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యకు పెద్దపీట వేస్తుందన్నారు. విద్యలో రాణిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో నిలబడతారని, దానికి కూటమి ప్రభుత్వాన్ని ఇస్తున్న విద్యా పథకాలను విద్యార్థులందరూ వినియోగించుకుని విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తొలుత మహాత్మా గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం అందించిన దోమతెరలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బడుగు శ్రీకాంత్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, కంటే జగదీష్ మోహన్, బలుసు వాసు, సరోజ వాసు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాత కుడిపూడి దానగుణం

30 లక్షలతో రెండు ఇల్లు నిర్మాణం

తాళ్లరేవు,(జి. ఎస్. బి వార్త): మానవ సమాజంలో ఎంతోమంది ఉదయం లేచిన దగ్గరనుంచి సాయంత్రం వరకు ప్రజలకు తన సన్నిహితులకు అభిమానులకు అది చేస్తాం ఇది చేస్తామని చెప్పి ఏదో ఒక హామీ ఇవ్వడం తర్వాత ఆరిపాటుగా మర్చిపోవడం ఎక్కువగా జరుగుతున్నటువంటి విషయాలు. లోకంలో అలవాటుగా చాలా విషయాలపై ఏరు దాటితే తెప్ప దాటేస్తారు అన్నట్లు నిరంతరం ప్రజలు వాడు కాగామాట్లాడుకుంటుంటారు. ఇటువంటి సమాజంలో కూడా నూటికి కోటికో ఎవరో ఒకరు ఆ నోట ఈ నోట మాటను నిలబెట్టుకునేవారు ఉంటారు అనుటకు ఈయనే నిదర్శనం అటువంటి వారే దానగుణం దయ ధర్మం కలిగినదాత కుడుపూడి శివన్నారాయణ కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పి మల్లవరం గ్రామపంచాయతీ పత్తి గొంది గ్రామానికి చెందిన కుడుపూడి శివన్నారాయణ రెండు పర్యాయాలు సర్పంచిగా, తాళ్లరేవు మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ గా పనిచేసి ఉన్నారు. పి మల్లవరం పంచాయతీ శివారు రాంజీ నగర్ గ్రామంలో 2023 లో గ్యాస్ పొయ్యి ఫైర్ అయ్యి ఐదు టాటా కీళ్లు అగ్నిపర్వతం లో గాలి బూడిదయ్యాయి. బాధితులు కట్టుబట్టలతో ప్రాణాలతో బయటపడ్డారు. అదే సమయంలో కుడుపూడి శివన్నారాయణ బాధితులను పరామర్శించి బాధితులు నిలబడేందుకు తాత్కాలిక సాయం అందించి ఉన్నారు. అంతటితో ఆగకుండా ప్రభుత్వ గృహ నిర్మాణం తో పాటు తానే స్వయంగా సొంత డబ్బులతో ఇల్లు నిర్మాణం చేసి ఇస్తానని బాధితులకు హామీ ఇచ్చారు. అగ్ని ప్రమాద బాధితులు కోరం రవి కోరం రమణ ఉండు అప్పారావు ఉండరు సత్తిబాబు దున్న భగవాన్ ఇందులో ఇద్దరు కోరం రమణ దున్న భగవానులకు మాత్రమే గృహ నిర్మాణం లోన్లు శాంక్షన్ అయ్యి ఉన్నాయి. కోరం రవి, కోరం రమణ ఒక్కో ఇంటి నిర్మాణానికి సుమారు 15 లక్షల చెప్పిన 30 లక్షలు ఖర్చు అయింది. ఇందులో లబ్ధిదారుల వాటాగా 30% ఉన్న మిగిలింది అబ్బాయి శాతం నిధులు దాత కుడుపూడి శివన్నారాయణ తన సొంత నిధులతో పిల్లి నిర్మాణం చేసి లబ్ధిదారులకు అందించారు. కుడుపూడి శివన్నారాయణ దంపతుల చేతుల మీదగా గృహ నిర్మాణాలు చేసి లబ్ధిదారులకు ఇళ్లను స్వాధీనం చేసి ఆదర్శప్రాయంగా నిలిచారు. ప్రస్తుత సమాజంలో ఎవరండీ మాటిచ్చి నిలబెట్టుకునేవారు మాకు ఆయనకు మాకు ఎటువంటి సంబంధం లేదని మాకు సొంత నిధులతో ఇల్లు కట్టించి ఇచ్చారని జీవితాంతం మా కుటుంబాలు ఆయనకు తరతరాలుగా రుణపడి ఉంటామని లబ్ధిదారుడు వారం రవి వాపోయారు. ఈ సందర్భంగా కుడిపూడి శివన్నారాయణ దంపతులకు లబ్ధిదారులు గ్రామ పెద్దలు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేటి నుంచి బంగారు వరలక్ష్మి కానుక -4
లక్కీడ్రా కార్యక్రమం ప్రారంభం...

రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు



గోకవరం ఆగస్టు 2: జి ఎస్ బి వార్తబంగారు వరలక్ష్మి కానుక -4లక్కీ డ్రా కార్యక్రమం ఈ నెల 3వ తేదీన గోకవరంలో ప్రారంభిస్తున్నట్లు, విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా భక్తుల్లో హైందవ చైతన్యం తీసుకురావాలనే సంకల్పంతో గత మూడు సంవత్సరాలు నుంచి బంగారు వరలక్ష్మి కానుక కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది కూడా బంగారు వరలక్ష్మి కనుక -4 శ్రీకారం చుట్టామన్నారు. ఈ నెల 3వ తేదీన గోకవరం-రాజమండ్రి రహదారిలోని కే.ఎస్.ఆర్ ఫంక్షన్ హాల్ లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5:00 వరకు లక్కీడ్రా కార్యక్రమం నిర్వహించి, గెలుపొందిన మహిళామూర్తులకు వరలక్ష్మి రూపులను ఉచితంగా అందజేస్తామన్నారు. 2023 సంవత్సరంలో శ్రావణమాసంలో వరలక్ష్మి వ్రతం చేసుకొనే మహిళల కోసం ఈ బంగారు వరలక్ష్మి కానుకను ప్రజల ముందుకు తీసుకువచ్చానని వెల్లడించారు. ఈ కార్యక్రమం ఎంతో విజయవంతం కావడంతో మూడు సంవత్సరాల నుండి దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది కూడా ప్రారంభిస్తున్నామన్నారు.. ఇటువంటి కార్యక్రమాన్ని ఇప్పటికి వరకు ఎవరు కూడా నిర్వహించలేదన్నారు. ఈ బంగారు వరలక్ష్మి లక్కీ డ్రాలో కులమతాలకు అతీతంగా ముస్లిం, క్రిస్టియన్లకు బంగారు రూపులు ఇవ్వడం జరిగిందన్నారు. గత ఏడాది డ్రాలో గెలవక పోయిన కూడ కొంత మంది ముస్లిం మహిళలకు బంగారు వరలక్ష్మి రూపులు ఇవ్వడం జరిగిందన్నారు. అందరు కూడా లక్ష్మీదేవిని ఎంతో గౌరవిస్తారని అన్నారు. ఈ నెల 3వ తేదీన గోకవరం, 4వ తేదీన గోకవరం చుట్టు పక్కల గ్రామాలు, 5వ తేదీన ఇందుకూరు పేట, 6,7,8వ తేదీల్లో కోరుకొండ గ్రామంలోని సుబ్రహ్మణ్యం స్వామి మైదానం, 9వ తేదీన శ్రీరంగపట్నం, 10,11,12 వ తేదీల్లో సీతానగరం జీవీకే ఫంక్షన్ హాల్ లో, 13వ తేదీన అడ్డతీగల, 14వ తేదీన రంపచోడవరంలో, 17,18,19 తేదీల్లో రాజానగరం మాధవి ఫంక్షన్ హాల్లో ఈ బంగారు వరలక్ష్మి కానుక లక్కీ డ్రా నిర్వహించడం జరుగుతుందని తెలుపారు..

దేవతామూర్తులకు శాకాంబరి అలంకారం

సామర్లకోట/ పెద్దాపురం, ఆగస్టు 2, జి ఎస్ బి వార్త : ఆషాడ మానం కావడంతో పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో ఉన్న పలువురు దేవతామూర్తులు ఆదివారం శాకంబరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామంలో వేంచేసియున్న ప్రముఖ దేవాలయమైన శ్రీ నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో నూకాలమ్మ అమ్మవారు, సామర్లకోట పట్టణంలో వేంచేసి ఉన్న గ్రామ దేవత అయిన శ్రీ నూకాలమ్మ అమ్మవారు శాకంబరీమాతగా భక్తులకు దర్శనం మీయగా భక్తులు అధిక సంఖ్యలో దేవతామూర్తులను దర్శించుకుని తరించారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక పూజలు చేపట్టగా ఆలయాలు కిటకిటలాడాయి. సామర్లకోట నూకాంబిక అమ్మవారు ఆలయంలో సామర్లకోట మండలం గొంచాల గ్రామానికి చెందిన భద్రాచలం పాదయాత్ర బృందం ప్రత్యేక పారాయణ చేపట్టారు. అలాగే ఆలయాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. ఆలయ అధికారులు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవారలను వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో ఆకర్షణీయంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలో ఆలయ అధికారులు, ఆలయ కమిటీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు...

మండు టెండలోనే దర్శనానికి బారులు

పెద్దాపురం, ఆగస్టు 2, జి ఎస్ బి వార్త : పెద్దాపురం ఇలవేల్పు దేవత అయిన శ్రీ మరిడమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేల కొలది భక్తులు ఆషాడ మాసం మూడో ఆదివారం సందర్భంగా అమ్మవారి దర్శనానికి విచ్చేసి ఎగబడ్డారు. అయితే ఆదివారం వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు సంభవించి ఎండలు రావడంతో దర్శనానికి విచ్చేసిన వేలాది భక్తులు మండుటెండలోని క్యూ లైన్ లలో వేచి ఉండి అమ్మవారిని దర్శించుకోవాల్సి వచ్చింది. ఆలయం ముందు భాగంలో భక్తుల కోసం ప్రత్యేక టెంట్లు ఏర్పాటు చేసినప్పటికీ అధికారులు ఊహించనంతగా భక్తులు భారీగా తరలి రావడంతో దేవాలయ అధికారులు ఏమి చేయలేని పరిస్థితి ఏర్పడ్డాయి. దానితో గంటలు తరబడి పిల్లాపాపలతో భక్తులు ఎండలోని వేచి ఉండి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆషాడ మాసం మూడవ ఆదివారం కావడంతో ఉత్సవాలు ముగింపుకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో భక్తులు సుదూర ప్రాంతాల నుంచి సైతం విచ్చేసి మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద ఆలయ కార్య నిర్వహణ అధికారిణి, దేవాదాయ సహాయ కమిషనర్ కె విజయలక్ష్మి, ఆలయ చైర్మన్ శ్రీహర్సల ఆధ్వర్యంలో ఉచిత పులిహోర పంపిణీ, వేడి పాలు బిస్కెట్లు, మంచినీరు, వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని ద్రాక్ష శీతల పానీయాలను భక్తులకు అందజేశారు. అకస్మాత్తుగా సంభవించిన వాతావరణ మార్పుల కారణంగా భక్తులు ఇబ్బంది పడినప్పటికీ అమ్మవారి దర్శనాలను కొనసాగించారు. భక్తుల రాకతో ట్రాఫిక్కు ఇబ్బంది కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఎదురవకుండా డి.ఎస్.పి ఏబిజి తిలక్ ఆధ్వర్యంలో సీఐ వై ఆర్ కే శ్రీనివాస్, ఎస్సై పాపారావులు ప్రత్యేక బందోబస్తు కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే రెవెన్యూ మున్సిపల్ సిబ్బంది సైతం ఆలయం వద్ద ఉండి ఆలయ సిబ్బంది భక్త సంఘ నాయకులతో కలిసి భక్తులకు సేవలు అందించారు. తెల్లవారుజామునే అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల దర్శనానికి అనుమతిని ఇచ్చారు.

మరిడమ్మ భక్తులకు జనసేన భారీ అన్నదానం

పెద్దాపురం, ఆగస్టు 2, జి ఎస్ బి వార్త : మరిడమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖశాంతులతో వర్ధిల్లాలని డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. పెద్దాపురం పట్టణంలో వైభవంగా జరుగుతున్న శ్రీ మరిడమ్మ తల్లి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెద్దాపురం పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు పొలమరశెట్టి సత్తిబాబు అధ్యక్షతన జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని తుమ్మల రామస్వామి ప్రారంభించి భక్తులకు ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరిడమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, అమ్మ కృపతో ప్రతి కుటుంబం సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆషాఢ మాసంలో జరిగే మరిడమ్మ జాతరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారన్నారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, ముఖ్యంగా ఆకలితో వెళ్లకుండా ఉండాలనే సంకల్పంతో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ఈ ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రజలకు సేవ చేయడం, అవసరంలో ఉన్న వారికి అండగా నిలవడం జనసేన పార్టీ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఆలయ ఉత్సవాలు ప్రజల్లో ఆధ్యాత్మిక భావనతో పాటు ఐక్యతను, సేవాభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. భక్తులకు అన్నదానం చేయడం మహాదానమని, అలాంటి పుణ్యకార్యంలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నదాన కార్యక్రమంలో సేవలనందించారు.

"ఫ్రెండ్స్ ఫరివర్స్" యువత సేవలు

సామర్లకోట, ఆగస్టు 2, జి ఎస్ బి వార్త : యువత అంకిత భావంతో ముందుకు వెళ్తూ సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని "ఫ్రెండ్స్ ఫరెవర్" అధ్యక్షులు నూతలపాటి సత్తిబాబు అన్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం పురస్కరించుకుని సామర్లకోట కి చెందిన ఫ్రెండ్స్ ఫరెవర్ యువత వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్దాపురం మండలం పులిమేరు శాంతి వర్ధన "విబిన్న ప్రతిభావంతుల" ప్రత్యేక ఆశ్రమ పాఠశాల నందు విద్యార్థులతో కలిసి స్నేహితుల దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం ఆశ్రమ పాఠశాలలో ఉన్న విద్యార్థులకు భోజన వసతిని కల్పించి విద్యార్థులకు స్వయంగా యువత వడ్డించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెకానిక్ శివ, పచ్చాకులు లోవరాజు, కాపవరపు లోవరాజు, గొల్లపల్లి నారాయణ, ఎలుగుబంటి అర్జున్, కటకం శ్రీను, అనిల్, తోట బాబి, రొంగల శ్రీనివాస్, కుంచె రాజేష్, సతీష్, గోవింద్, వినోద్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పిడి యువరాజారెడ్డికి పుత్రవియోగం

పెదపూడి(జి ఎస్ బి వార్త) పెదపూడి మండలం గొల్లలమామిడాడ గ్రామానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు ద్వారంపూడి యువరాజారెడ్డి ముద్దుల కుమారుడు ద్వారంపూడి కృష్ణారెడ్డి(కిట్టు) (17)ఆకస్మికంగా మృతిచెందారు. అందరి తలతోనాలుకలా మెలిగే కిట్టు ఆకస్మిక మరణంతో గొల్లలమామిడాడ గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కిట్టు ఆకస్మిక మృతి పట్ల మాజి జడ్పిటిసి సత్తి భగవాన్ రెడ్డి, మేడపాటి సాయిబాబారెడ్డి, ద్వారంపూడి వెంకటరెడ్డి(చింతవండు), కర్రి రామకృష్ణారెడ్డి, ద్వారంపూడి బంగారెడ్డి,ద్వారంపూడి వీర్రాఘవరెడ్డి(ఐస్ బుజ్జి), నల్లమిల్లి భూలోక రెడ్డి, నల్లమిల్లి అప్పారెడ్డి,వ్యాయామ ఉపాధ్యాయ, ఉపాధ్యాయ సంఘాలు సంతాపం వ్యక్తం చేశారు

మై భారత్, కాకినాడ ఆధ్వర్యంలో ఘనంగా "నషా ముక్త్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్"

కాకినాడ, ఆగస్టు 02:(జిఎస్ బి వార్త) : మై భారత్, కాకినాడ ఆధ్వర్యంలో "నషా ముక్త్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్" కార్యక్రమం ఆదిత్య యూనివర్సిటీ సూరంపాలెం కాకినాడలో ఆదివారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఆదిత్య యూనివర్సిటీ మై భారత్ వాలంటీర్లు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్చువల్ విధానంలో భారత ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా యువతను ఉద్దేశించి ప్రసంగించారు. మాదక ద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని, ప్రతి యువకుడు "నషా ముక్త్ భారత్ -- వికసిత్ భారత్" నిర్మాణంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల నిర్మూలనలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటం ద్వారా ఆరోగ్య వంతమైన, బాధ్యతా యుతమైన సమాజ నిర్మాణానికి ప్రతి యువకుడు తన వంతు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు తమ కుటుంబాలు, స్నేహితులు, సమాజంలో మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించే దూతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఆదిత్య యూనివర్సిటీ ఛాన్సలర్ గా.ఎన్.సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. యువత తమ శక్తి, ప్రతిభను దేశాభివృద్ధికి వినియోగిస్తూ మాదక ద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మాదక ద్రవ్యాలదుష్పరిణామాలను ప్రతిబింబించే నుక్కడ్ నాటక్ ప్రదర్శించి ప్రేక్షకులను ఆలోచింప జేశారు. అనంతరం ప్రధాన మంత్రి సందేశాన్ని వీక్షించి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ సమాజంలో అవగాహన కల్పించేందుకు విద్యార్థులు సంకల్పం చేశారు. ఈ కార్యక్రమంలో మై భారత్ జిల్లా యువజన అధికారి గోపి, కాకినాడ జిల్లా డీజెబుల్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, కాకినాడ ఈగల్ టీమ్ సీఐజీ వేంకటేశ్వర రావు, ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి,డీన్ స్టూడెంట్ ఆక్టివిటీస్ డి.కిషోర్, ఈగల్ టీమ్ మై భారత్ సిబ్బంది,ఎం.ప్రకాష్, జి.భవాని తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్మాత్మకంగా టీడీపీ ఇంటింటి ప్రచారం

కరప, ఆగస్టు 2:(జిఎస్ బి వార్త) : కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్మాత్మకంగా చేపట్టిన ఇంటింటి ప్రచారం కార్యక్రమంలో ఘనంగా జరుగుతోందని, ప్రభుత్వం పనితీరు పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని, సంక్షేమ పథకాలు తమకు అందుతున్నాయని ప్రజలు చెబుతున్నారని టీడీపీ కాకినాడ రూరల్ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్తిబాబు అనంతపూర్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వేములవాడ గ్రామంలో వారు 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమములో పాల్గొని, ఇంటింటికీ వెళ్లి రెండేళ్ల కూటమి పాలనపై అందజేసి, ఈ కాలంలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వారికి వివరించారు. ప్రజల నుండి ప్రభుత్వ పనితీరుగురించి, సంక్షేమం పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి సత్తిబాబు సంపతులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పనితీరుపట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలు తమకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని తెలియజేస్తున్నారని చెప్పారు. మహిళలకు ఇటీవలే తల్లికి వందనం పడడం, ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సబ్సిడీ, ఒకటవ తేదీనే పింఛన్లు పడడం లాంటివాటి పట్ల అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆమె తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ఇటు సంక్షేమంతోపాటుగా అటు అభివృద్ధి విషయంలో కూడ చాలా పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటోందని వివరించారు. ఈ కార్యక్రమంలో కరప నీటి సంఘం చైర్మన్ పుణ్యమంతుల గంగ సత్యనారాయణ,కూటమి నాయకులు నూలుకుర్తి వెంకటేశ్వరరావు,చుంద్రు వెంకన్న రాయి చౌదరి, పీజీ సత్యనారాయణ, కోటగిరి మహేంద్ర బాబు, పిల్లి కృష్ణ ప్రసాద్ (బుజ్జి) మద్దూరి స్వామి, పంపన కన్నారావు, రెడ్డి వీర వెంకట సత్యనారాయణ, పేపకాయల సత్తిబాబు, ఆట్ల గోవిందరాజు, యనమదల వెంకటలక్ష్మి దొరబాబు, కంటే సత్తిబాబు, చాట్రా ఇమ్మానుయేలు, పలివెల జానకి రామయ్య, పాట్నీడి రాంబాబు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

శ్రీ గురజాల అక్కమ్మ తల్లి జాతర మహోత్సవాల్లో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం (జిఎస్ బి వార్త) : రాజమహేంద్రవరం సాటిలైట్ సిటీలో అత్యంత వైభవంగా జరుగుతున్న శ్రీ గురజాల అక్కమ్మ తల్లి జాతర మహోత్సవాలలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, నిర్వాహకులు మంత్రి దుర్గేష్ కు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి మంత్రి దుర్గేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి, శేషవస్త్రంతో పాటు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ. గురజాల అక్కమ్మ తల్లి ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి, ప్రగతి పథంలో నిరంతరం ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నారు. సంస్కృతీ సంప్రదాయాలను, గ్రామీణ జాతరలను కాపాడుకోవడం మనందరి అందరి బాధ్యత అని పేర్కొన్నారు.

8న మన్యంలో బంద్ కి పిలుపు ఇచ్చిన : ఆదివాసీ సంఘాలు

గోకవరం ఆగస్టు 3జి ఎస్ బి వార్త : ఈ నెల 8న మన్యం బంద్ కు పిలుపునిస్తున్నట్లు ఆదివాసీ సంఘాలు ప్రకటించాయి. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలకు 100% రిజర్వేషన్ కల్పించే జీవో నం.3/2000ను పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. అలాగే 50% గిరిజన జనాభా కలిగిన గ్రామాలను షెడ్యూల్ ప్రాంతంలో చేర్చాలంది. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జవీ వీటిపై ప్రకటన చేయాలని స్పష్టం చేసింది. దీంతో మన్యం, అల్లూరి, పోలవరం జిల్లాల్లో బంద్ ఉండే అవకాశం ఉంది.

ఘనంగా ఫ్రెండ్షిప్ వేడుకలు

చిన్ననాటి జ్ఞాపకాల్లో పూర్వ విద్యార్థులు

సామర్లకోట, ఆగస్టు 2, జి ఎస్ బి వార్త : ఫ్రెండ్షిప్ డే వేడుకలు సామర్లకోట లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. 1983 నాటి పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఒకే చోట కలుసుకుని తమ స్నేహానుభూతులను నెమరు వేసుకున్నారు. వీరందరు సీనియర్ టీనేజర్ గ్రూపుగాఏర్పడ్డారు.1983లో స్థానిక గవర్నమెంట్ హైస్కూల్లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఫ్రెండ్షిప్ వేడుకలు నిర్వహించారు. స్థానిక నీలమ్మ చెరువు వద్ద గల లయన్స్ క్లబ్ భవనంలో సీనియర్ టీనేజర్ గ్రూప్ నాయకులు బుర్రె కృష్ణమోహన్, దవులూరి నాగేశ్వరరావు, లంకా సన్యాసిరావు, మహమ్మద్ గౌస్ (సలీం)ల ఆధ్వర్యంలో ఫ్రెండ్షిప్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సీనియర్ టీనేజర్స్ గ్రూపు అధ్యక్షులు బుర్రె కృష్ణ మోహన్ మాట్లాడుతూ సీనియర్ టీనేజర్ గ్రూపు ఏర్పడి ద్వితీయ సంవత్సరం అయిన సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. పూర్వ విద్యార్థుల్లో కొందరు చనిపోయిన కారణంగా వారందరికీ తగిన విధంగా ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. భవిష్యత్తులో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేయుటకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి ఆగంటి లక్ష్మీనారాయణ మధుర గీతాలు ఆలపించి అందరినీ అలరించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలిచిన పూర్వ విద్యార్థులకు బహుమతి ప్రధానం గావించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీనేజర్ నాయకులు దవు లూరి నాగేశ్వరరావు, గోలి సత్తిరాజు, కొత్తపల్లి రవికుమార్, వద్దిపర్తి రామకృష్ణ, వాస శుభకిరణ్, పెమ్మాడి వీరభద్ర వర్మ, పిడుగు పాపారావు, కటకం తాతాజీ, గొల్లవిల్లి సూర్యనారాయణ, అల్లాడ అంకయ్య, తణుకు నరేష్, డి శ్రీనివాస్, కుర్ర వెంకటేశ్వరరావు, ఇంటి సుబ్బారావు, కంచర్ల కొండబాబు, వెదురుపాక సురేష్ విజయమూరి శ్రీనివాసు పి వి వి సత్యనారాయణ అనపర్తి రామ్మోహన్ వాసంశెట్టి రామారావు తదితరులు పాల్గొన్నారు.

రూరల్ ల్లో 331మంది లబ్ధిదారులకు రూ.3,24,72,673 ఇప్పటి వరకు సీఎం సహాయనిధి

రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

కాకినాడరూరల్ , (జిఎస్ బి వార్త) : ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన 16 ఎల్ ఓ సి తో కలిపి) చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందిస్తున్నారని తెలిపారు. ఆదివారం 16 మందికి 21 లక్షల 22 వేల 47 రూపాయలు విలువ చేసే చెక్కులు లబ్ధిదారులకు రూరల్ ఏమ్మెల్యే పంతం నానాజీ అందించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి ఇప్పటివరకు 467 దరఖాస్తులను సీఎంఓ కార్యాలయానికి పంపించామని, అలాగే 24 ఎల్వోసీల తో కలిపి మంజూరు చేయించినట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు 331మంది లబ్ధిదారులకు రూ.3,24,72,673 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసినట్లు తెలిపారు. వీటిలో ప్రత్యేకంగా 23 ఎల్వోసీల ద్వారా సుమారు రూ.71 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. అత్యవసర చికిత్స కోసం ఆసుపత్రిలో చేరిన వెంటనే, ఆసుపత్రి ఇచ్చిన అంచనా వ్యయం (ఎస్టిమేట్) ఆధారంగా ప్రభుత్వం పరిశీలించి ఎల్వోసీ జారీ చేస్తుందని, దీంతో రోగికి ముందుగానే చికిత్స కోసం అవసరమైన నిధులు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ప్రస్తుతం 136 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయనిధి అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ప్రతి కుటుంబానికి భరోసాగా ఉంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు కరెడ్ల గోవింద్ , తాటికాయల వీరబాబు , మాదారపు తాతాజీ ,బండారు మురళి , బోగిరెడ్డి కొండబాబు ,గేదల చిన్నారావు , గంట ప్రసాద్ ,మీసాల రాంబాబు, సూతి శ్రీనివాస్ , దొడ్డిపట్ల అప్పారావు, గొల్లపల్లి బాబీ , గొల్లపల్లి నాగేశ్వరరావు ,అనుకూల రాంబాబు , బుజ్జి , అన్నవరం ,తోట కూర సతీష్ , సంతోష్ , విరమళ్ళ బాబీ , అడపా కృష్ణ , ముమ్మిడి బుజ్జి , ముమ్మిడి పట్టాభి , మాలతి, పాలిక రమణ, చలపతి ,నూరుకుర్తి గోవింద్ , బూరయ్య , యాళ్ల పండు , నున్న గణేష్ నాయుడు , మంజు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఏడేళ్లు కాకినాడ జిల్లా విధులలో సంతృప్తి

విశ్రాంత ఎస్ఇ ప్రసాద్

కాకినాడ, (జిఎస్ బి వార్త) కాకినాడ జిల్లాలో విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ (ఎస్ఇ)గా విధులు నిర్వహించడం ఎంతో సంతృప్తి కలిగిందని విద్యుత్ శాఖ ఎస్ఇ గా పనిచేసిన గౌర్ల ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ప్రసాద్ పదవి విరమణ సభను ఆ శాఖ ఉద్యోగులు జి కన్వెన్షన్లో నిర్వహించి అతనిపై అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో విద్యుత్ శాఖలో పనిచేస్తున్న డిఇలు, ఎఇలు, లైన్మెన్లు, సిబ్బంది హాజరయ్యారు.

ఈ సందర్భంగా ప్రసాద్ గురించి విశ్రాంత అధికారులు, విధుల్లో ఉన్న అధికారులు చేసిన పనులను వివరించారు. ప్రసాద్ మాట్లాడుతూ 2015లో కాకినాడకు బదిలీ అయ్యానని తిరిగి వెళ్ళిపోదాం అనుకున్నా ఇక్కడ వారు చూపించే ప్రేమ అభిమానం తనను తిరిగి వెళ్ళనీయ లేదన్నారు. సిబ్బంది సహకారం జిల్లాలో అందరి కలెక్టర్ల వద్ద పనిచేసి గౌరవం సంపాదించుకున్నట్లు చెప్పారు. అనంతరం ప్రసాద్, సుధారాణి దంపతులను పూలమాలతో సన్మానించారు. ప్రసాద్ కుటుంబ సభ్యులు సుదూర ప్రాంతాల నుంచి వారి మిత్రులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఇఇ ఎన్ ఉదయ్ భాస్కర్, కె రాంబాబు, రాంజీ నాయుడు, సత్యనారాయణ రెడ్డి, రామ్మోహన్రావు, గోపాలకృష్ణ, సాయి ప్రీతం, ప్రసాద్, రవికుమార్, శ్రీనివాస్, వీరభద్రరావు, ప్రభాకర్, మోహన్, ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ పై అవగాహన...

యు కొత్తపల్లి ఆగస్టు 2(జి ఎస్ బి వార్త)కొత్తపల్లి మండలం ఉప్పాడ బీచ్ రోడ్ లో పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి శ్రీనివాస్ ఆధ్వర్యంలో "డ్రగ్స్ వద్దు బ్రో" పేరుతో డ్రగ్స్ వ్యతిరేక అవగాహనకార్యక్రమం ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా సి ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉప్పాడ మరియు పరిసర ప్రాంతాలలో గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగం, రవాణాను అరికట్టేందుకు ప్రజలంతా పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత దారితప్పి తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవడమే కాకుండా, తల్లిదండ్రులకు మరియు సమాజానికి భారంగా మారుతున్నారని తెలిపారు. డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుండి పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజలు ముందస్తు సమాచారాన్ని పోలీస్ శాఖకు అందించి ప్రభుత్వం ప్ర, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో కొత్తపల్లి ఎస్ ఐ వెంకటేష్,స్థానిక పోలీసు సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్

హద్దు మీరితే కేసులు తప్పవు

కాకినాడ, (జిఎస్ బి వార్త) : జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా జిల్లావ్యాప్తంగా రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరిస్తూ.. సమాజంలో అరాచకాలు సృష్టించినా, బెదిరింపులు, అక్రమ సెటిల్మెంట్లకు పాల్పడినా ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. ప్రవర్తన మార్చుకుని సాధారణ జీవితం గడపాలని, హద్దు మీరితే కఠిన చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ వన్టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీ ఎం. నాగదుర్గారావు, పెదపూడి ఎస్ఐ బుజ్జిబాబు, కాకినాడ రెండవ పట్టణ ఇన్స్పెక్టర్ మజ్జి అప్పలనాయుడు, సర్పవరం ఎస్సై ఎం. యేసుబాబు సంబంధిత పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

కాకినాడ లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు చేసిన పోలీసులు

కాకినాడ, (జిఎస్ బి వార్త) : కాకినాడ వన్టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వన్టౌన్ సీఐ ఎం. నాగదుర్గారావు ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించడం, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం, పేకాట, క్రికెట్ బెట్టింగ్, వ్యభిచారం, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలను నిరోధించడం, అలాగే అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడం లక్ష్యంగా లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా లాడ్జీల్లో బస చేస్తున్న వ్యక్తుల వివరాలు, రిజిస్టర్లు, గుర్తింపు పత్రాలను పరిశీలించి నిబంధనల అమలును తనిఖీ చేశారు. లాడ్జి యజమానులు, నిర్వాహకులు ప్రతి అతిథి నుంచి ఆధార్ కార్డు లేదా ఇతర ప్రభుత్వ గుర్తింపు పొందిన ఫోటో గుర్తింపు పత్రం తప్పనిసరిగా తీసుకున్న తర్వాతే గదులు కేటాయించాలని ఆదేశించారు. సందర్శకుల పూర్తి వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయడంతో పాటు వాటి కాపీలు ఎప్పటికప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్ కి పంపాలని సూచించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు లేదా అనుమానాస్పద వ్యక్తులు లాడ్జీల్లో బస చేస్తున్నట్లు గుర్తించినా, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం తెలిసినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు లేదా 112 అత్యవసర సేవలకు సమాచారం అందించాలని కోరారు.

చేయూత చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో "హగ్ ఏ ట్రీ " -- 1000 మొక్కల పంపిణీ

కాకినాడ ఆగస్టు2:(జిఎస్ బి వార్త) : ఫ్రెండ్షిప్ డే సందర్భంగా చేయూత చారిటబుల్ సొసైటీ, ఆధ్వర్యంలో వివేకానంద పార్క్‌లో ఆదివారం నాడు నిర్వహించిన హగ్ ఏ ట్రీ కార్యక్రమం మరియు 1000 మొక్కల ఉచిత పంపిణీ కార్యక్రమం విజయవంతమైందని సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎం రవికుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో చేయూత సభ్యులు, చిన్నారులు, యువత, మహిళలు, స్వచ్ఛంద సేవకులు, ప్రకృతి ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొని చెట్లను ఆలింగనం చేసుకుంటూ "ప్రకృతితో స్నేహం చేద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే సందేశాన్ని సమాజానికి చాటిచెప్పారు.కార్యక్రమంలో భాగంగా 1000 మొక్కలను ఉచితంగా పంపిణీ చేసి, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కలను నాటడం మాత్రమే కాకుండా వాటిని పెద్ద చెట్లుగా పెంచి భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించడం ప్రతి పౌరుడి బాధ్యత అని డాక్టర్ ఎం రవి కుమార్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా చేయూత చారిటబుల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు డా. ఎం. రవి కుమార్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. ప్రకృతిని ప్రేమించడం అంటే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన జీవనాన్ని అందించడమేనని అన్నారు.ఈ కార్యక్రమంలో గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు గ్రంధి బాబ్జీ, చోడవరపు మూర్తి, అహ్మద్, చేయూత చారిటబుల్ సొసైటీ మహిళా విభాగ అధ్యక్షురాలు సురభి శారద, వ్యవస్థాపక సభ్యులు చింతా నారాయణ మూర్తి, మహిళా విభాగ సభ్యురాలు తేజస్వి, ఎడ్యుకేషన్ వింగ్ చైర్మన్ కందుకూరి పాల్ రాజు, అలాగే పవన్, శ్రీరామ్, పండు, సుభాన్, వెంకట్ , మంజుల తదితర సభ్యులు పాల్గొన్నారు"మనిషికి మనిషే చేయూత... ప్రకృతికి మనందరం చేయూత" అనే నినాదంతో భవిష్యత్తులో మరిన్ని పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహించి సమాజంలో పచ్చదనంపై మరింత అవగాహన కల్పించేందుకు చేయూత చారిటబుల్ సొసైటీ కృషి కొనసాగిస్తుందని డాక్టర్ మొండి రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంధి బాబ్జీ, అహ్మద్, చేయూత చారిటబుల్ సొసైటీ అధ్యక్షురాలు సురభి శారద, వ్యవస్థాపక సభ్యులు చింతా నారాయణ మూర్తి, మహిళా విభాగ సభ్యురాలు తేజస్వి, ఎడ్యుకేషన్ వింగ్ చైర్మన్ కందుకూరి పాల్ రాజు, అలాగే పవన్, శ్రీరామ్, పండు, సుభాన్, వెంకట్ , మంజుల తదితర సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన సభ్యులు, వాలంటీర్లు, చిన్నారులు, దాతలు, శ్రేయోభిలాషులు మరియు మీడియా ప్రతినిధులకు చేయూత చారిటబుల్ సొసైటీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. "మనిషికి మనిషే చేయూత... ప్రకృతికి మనందరం చేయూత" అనే నినాదంతో భవిష్యత్తులో మరిన్ని పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహించి సమాజంలో పచ్చదనంపై మరింత అవగాహన కల్పించేందుకు చేయూత చారిటబుల్ సొసైటీ కృషి కొనసాగిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వరద పరిస్థితి విశ్లేషణ

గోదావరి ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద ప్రవాహం కొనసాగుతుండటంతో ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వద్ద నీటి మట్టం నిరంతరంగా పెరుగుతోంది. రాత్రి 12 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ప్రతి గంటకూ గేజ్ స్థాయి, పాండ్ లెవల్, మిగులు ప్రవాహం పెరిగినట్లు రీడింగ్స్ స్పష్టం చేస్తున్నాయి.

గంటల వారీ పరిస్థితి

సమయం గేజ్ (ట్) పాండ్ (ఎ) మిగులు ప్రవాహం (క్యూసెక్కులు)

గంటల వారీ పరిస్థితి సమయం గేజ్ (ట్) పాండ్ (ఎ) మిగులు ప్రవాహం (క్యూసెక్కులు)

భద్రాచలం కూనవరం ధవళేశ్వరం లో వరద పరిస్థితి

రాజమహేంద్రవరం ఆగస్టు 2 జి ఎస్ బి వార్త : సోమవారం ఉదయానికి గోదావరి ఫ్లడ్ స్టేషన్స్ అయినా భద్రాచలం, కూనవరం, ధవళేశ్వరంలలో గోదావరి వరద అప్డేట్ ఉదయం 4 గంటల నుండి ఇలా ఉంది. భద్రాచలం వద్ద 39.30 అడుగులు, కూనవరం వద్ద 19.20 మీటర్స్ కు వరద తగ్గడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఇక ధవళేశ్వరంలో 13.50 అడుగులుగా గోదావరి వరద ప్రవహిస్తూ మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయిలో కొనసాగుతుంది.

అభిమానుల సందడి మధ్య ప్రజా వైద్యుడు బోసు బాబు జన్మదిన వేడుకలు

గోకవరం ఆగస్టు 2 జి ఎస్ బి వార్త :అభిమానుల కోలాహలం సందడి మధ్య ప్రజా వైద్యుడు బోసు బాబు జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. గోకవరం జూనియర్ కళాశాల ఆవరణలో జరిగినఈ జన్మదిన వేడుకలకు మండలంలోని పలు గ్రామాల నుండి అభిమానులు టిడిపి కార్యకర్తలు ప్రజలు విశేషంగా వచ్చి బోసు బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బోసుబాబు ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని వైద్య వృత్తి ద్వారా ప్రజలకు మరింత వైద్య సేవలు అందజేయాలని ఆకాంక్షించారు ఈ సందర్భంగా పలువురు బోసు బాబును పూ లమాలలతో అలంకరించారు అనంతరం ఏర్పాటైనవిం దులో పలువురు పాల్గొని భోజనాలు చేయడం జరిగింది.

వరద ముంపు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటన

జిల్లా జాయింట్ కలెక్టర్ వై.ఖోమ్.నైడియా దేవి.

అమలాపురం, ఆగస్టు 2,(జిఎస్ బి వార్త) : జిల్లాలో వరద ముప్పు పొంచి ఉన్న ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీమతి వైఖోమ్ నైడియా దేవి అధికారులను ఆదేశించారు. మామిడికుదురు మండలంలోని వరద ప్రభావిత, ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్లంలంక ప్రాంతాలను జాయింట్ కలెక్టర్ ఆదివారం సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని వరద ముంపు పరిస్థితులు, నీటి ప్రవాహం, లోతట్టు ప్రాంతాల పరిస్థితి, ప్రజల రాకపోకలు, రహదారుల పరిస్థితి తదితర అంశాలను ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు, వరదల కారణంగా ఆయా ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందనే అంశంపై అధికారులతో చర్చించారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జాయింట్ కలెక్టర్ అధికారులకు సూచించారు. నీటి మట్టం పెరుగుతున్న తీరు, వరద ప్రవాహాన్ని నిరంతరం గమనిస్తూ సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితి విషమిస్తే ప్రజలను అప్రమత్తం చేసి, అవసరమైన సమయంలో సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా అధికారులు వెంటనే స్పందించేలా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

వరదల సమయంలో ప్రజలకు తాగునీరు, విద్యుత్, వైద్యం, పారిశుధ్యం, రవాణా వంటి మౌలిక సదుపాయాలకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. అవసరమైన చోట సహాయక బృందాలను సిద్ధంగా ఉంచడంతో పాటు అత్యవసర సేవలకు సంబంధించిన సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వరద పరిస్థితుల్లో ప్రజలకు అందించాల్సిన సహాయక చర్యలపై అధికారులు ముందుగానే కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని, అవసరమైన సహాయ సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు, అనారోగ్యంతో ఉన్నవారు తదితరులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వరద పరిస్థితులను కేవలం కార్యాలయాల నుంచి కాకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, ప్రజలకు అవసరమైన సూచనలు, హెచ్చరికలను చేరవేయాలని సూచించారు. ప్రజలు కూడా అధికారుల సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని, వరద ప్రవాహం ఉన్న ప్రాంతాల్లో అనవసరంగా రాకపోకలు సాగించవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్లంలంక ప్రాంతాల్లో పర్యటన సందర్భంగా జాయింట్ కలెక్టర్ క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి, ప్రజల భద్రతకు అవసరమైన చర్యలను చేపట్టడంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. వరద ముప్పు పూర్తిగా తొలగే వరకు పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ పర్యటనతోఆయా ప్రాంతాల్లో వరద పరిస్థితులపై అధికార యంత్రాంగం మరింత అప్రమత్తమైందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టేందుకు చర్యలు ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు. జాయింట్ కలెక్టర్ వెంట మామిడి కుదురు తాసిల్దార్ సి ఎస్ రాజు ఎంపీడీవో జి.భవాని జిల్లా అధికారులు, మండల అధికారులు రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో పెరుగుతున్న ఊబకాయం సమస్య

పిల్లలు చిన్నప్పుడు చూడటానికి బొద్దుగా ఉంటే మనకు ముద్దుగా ఉంటుంది. బొద్దుగా ఉండటం ముద్దే కానీ కాలక్రమేణా ముప్పుగా మారుతుందట. ఆటపాటలతో ఆనందంగా గడపాల్సిన వయసులో పిల్లలు నేడు ఊబకాయం అనే ఉచ్చులో చిక్కుకుంటున్నారు. ప్రతియేటా ఊబకాయం బారిన పడుతున్న పిల్లల సంఖ్య 5 శాతం పెరుగుతున్నారంటే అర్థం చేసుకోవచ్చు. పిల్లల భవిష్యత్తును అంధకారంవైపు నెడుతున్న ఈ సైలెంట్ ఎమర్జెన్సీ గురించి తల్లిదండ్రులుగా తెలుసుకుందాం.. ఇటీవల వెలువడిన ఒక నివేదిక భారత ప్రజా ఆరోగ్యం యొక్క భవిష్యత్తులపై ఆందోళన రేకెత్తిస్తోంది. వరల్డ్ ఒబేసిటీ ఫెడరేషన్ విడుదల చేసిన World Obesity Atlas 2026 నివేదిక ప్రకారం ఊబకాయం, అధిక బరువుతో బాధపడుతున్న పిల్లల సంఖ్యలో ప్రపంచవ్యాప్తంగా చూస్తే చైనా మొదటి స్థానంలో ఉంటే.. మన భారతదేశం రెండో స్థానంలో ఉండటం ఆందోళ కలిగించే అంశం. ఈ గణాంకాల కంటే ఊబకాయం అనే సంక్షోభం విస్తరిస్తున్న వేగం ఆందోళన కలిగించే అంశం. మన భారతదేశంలో బాల్య ఊబకాయం (Childhood Obesity) ఏటా 5 శాతం పెరుగుతుండటం విశేషం. 2025 నాటికి భారతదేశంలో 5 నుంచి 19 ఏళ్ల మధ్య ఉన్న పిల్లలు సుమారు 41.32 మిలియన్ల మంది అంటే 4 కోట్ల 32 లక్షల మంది పిల్లలు ఊబకాయం బారిన పడ్డారట. వీరిలో 5 నుంచి 9 ఏళ్ల మధ్య ఉన్న పిల్లలు 14.92 మిలియన్ల మంది కాగా.. 10 నుంచి 19 ఏళ్ల మధ్య వయసు గల పిల్లలు26.40 మిలియన్ల మంది ఉన్నారు. 2030 నాటికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో డాక్టర్ మనోహర్ కేఎన్, లీడ్ కన్సల్టెంట్ – ఇంటర్నల్ మెడిసిన్ అండ్ డయాబెటాలజీ చెబుతున్న ఊబకాయం పెరగడానికి కారణాలు, నివారణ మార్గాలను తెలుసుకుందాం.. భారతదేశంలో పెరుగుతున్న ఊబకాయం సమస్య వేగంగా మారుతున్న జీవనశైలికి ప్రత్యక్ష నిదర్శనం. పిల్లలకు ఆటపాటలు, శారీరక శ్రమ లేకపోవడం, విపరీతంగా ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు తీసుకోవడం, అస్తవ్యస్తమైన ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడి వంటివి ప్రధాన కారణాలు. ఇక్కడ ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే ఊబకాయం పెద్దలకే పరిమితం కాకుండా.. పిల్లలకు, టీనేజర్లకు కూడా వేగంగా విస్తరిస్తోంది. శరీరం ఖర్చు చేసే శక్తి కంటే తీసుకునే క్యాలరీల శాతం ఎక్కువగా ఉన్నప్పుడు అది కొవ్వు రూపంలో పేరుకుపోతుంది. దీనికి తోడు హార్మోన్ల అసమతుల్యత, నిద్రలేమి, ఇన్సులిన్ రెసిస్టెన్స్ వంటి అంశాలు ఈ సమస్యను మరింత క్లిష్టతరం చేస్తున్నాయి. అయితే దీనికి పరిష్కారం కఠినమైన మార్పుల్లో లేదు. స్థిరమైన మరియు ఆరోగ్యకరమైన మార్పుల్లోనే ఉంది. అదెలాగంటే.. పీచు పదార్థం (ఫైబర్), ప్రోటీన్, సహజ సిద్ధమైన ఆహారంతో కూడిన సమతుల్య డైట్, క్రమం తప్పని వ్యాయామం దీనిని అత్యంత అవసరం. అలాగే సరైన నిద్రవేళలు పాటించడం, ఒత్తిడి తగ్గించుకోవడం కూడా చాలా ముఖ్యం. ఎందుకంటే ఇవి నేరుగా మెటబాలిజంపై ప్రభావం చూపుతాయి. అంతేకాకుండా మొదట్లోనే హెల్త్ చెకప్స్ చేయించుకోవడం వల్ల మెటబాలిక్ రిస్క్‌లను గుర్తించవచ్చు. ఈ ఊబకాయం అనేది కేవలం రూపానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు. ఇది షుగర్, గుండె జబ్బులు వంటి అనేక దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతుంది. అందుకే సరైన సమయంలో స్పందించడం ముఖ్యమని సూచిస్తున్నారు.

వడదెబ్బతో తస్మాత్ జాగ్రత్త, హీట్ స్ట్రోక్ లక్షణాలు

వడదెబ్బ లేదా సన్ స్ట్రోక్ అనేది అధిక ఉష్ణోగ్రతల వద్ద తలెత్తే ఒక ప్రమాదకర పరిస్థితి. ఎండలో ఎక్కువ సేపు గడపడం వల్ల శరీరంలో వాటర్ శాతం తగ్గిపోయి అంతర్గత వేడి విపరీతంగా పెరిగిపోతుంది. సకాలంలో వైద్యం అందించకపోతే ప్రాణాంతకంగా మారి అంతర్గత అవయవాలను దెబ్బతీస్తుంది. పరిస్థితి విషమిస్తే ఫిట్స్ రావడం, వాంతులు, విరేచనాలు కావడం స్పృహ కోల్పోవడం వంటి తీవ్ర పరిణామాలకు దారితీయ వచ్చు. కాబట్టి వీలైనంత తొందరగా ప్రాథమిక చికిత్స అందించాలి. ప్రస్తుతం సూర్యుడు ప్రతాపం చూపెడుతున్నాడు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయ్. కేవలం వేడి పెరగడమే కాదు భానుడి భగభగలకు మన శరీరం తట్టుకోలేక నియంత్రణ కోల్పోయే పరిస్థితి. మన భాషలో చెప్పాలంటే అదే వడదెబ్బ. ఇది కేవలం అలసట అనుకుంటే పొరపాటు. సకాలంలో స్పందించకపోతే ప్రాణాపాయం కలిగించే అత్యవసర పరిస్థితి. శరీర ఉష్ణోగ్రత అసాధారణంగా పెరిగిపోయినప్పుడు మెదడు, ఇతర అంతర్గత అవయవాలు తీవ్ర ఒత్తిడికి గురవుతాయి. ఎండ కారణంగా శరీరంలో నీటి శాతం తగ్గిపోవడమే దీనికి ప్రధాన కారణం. వడదెబ్బ తగిలిన వ్యక్తికి మొదటి గంటలో చికిత్స అందించడం అత్యంత కీలకం. ప్రాథమిక దశలో వైద్య సహాయం అందకపోతే ప్రాణాపాయానికి దారితీస్తుందని డాక్టర్ అరవింద ఎస్ఎన్, లీడ్ కన్సల్టెంట్– ఇంటర్నల్ మెడిసిన్ చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వడదెబ్బ లక్షణాలు ఏంటి? వడదెబ్బ నివారణ చిట్కాలు ఏంటో కూడా తెలుసుకుందాం..

వడదెబ్బకు సంబంధించి డాక్టర్ అరవింద ఎస్ఎన్ చెబుతున్న దాని ప్రకారం.. వదదెబ్బనే హీట్ స్ట్రోక్ అని కూడా పిలుస్తారు. అధిక ఉష్ణోగ్రతలో ఎక్కువ సమయం గడపడం వల్ల శరీరంలోని ద్రవాలను కోల్పోయి శరీరంలో వేడి విపరీతంగా పెరిగిపోతుంది. వడదెబ్బ తగిలినప్పుడు శరీర ఉష్ణోగ్రత 40°C కంటే ఎక్కువగా ఉంటుంది. తలనొప్పి, వాంతులు, వికారం వంటి లక్షణాలు ఉంటాయి. పరిస్థితి విషమిస్తే ఫిట్స్, స్పృహ కోల్పోవడం వంటివి సంభవిస్తాయి. శరీరాన్ని డీహైడ్రేట్ కాకుండా చూసుకోవడం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో ఎండలో తిరగకపోవడం, తేలికపాటి దుస్తులు ధరించడం, టీ కాఫీలు, మద్యం వంటి వాటికి దూరంగా ఉండటం పాటించాలని సూచిస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలు : వడదెబ్బ తగిలిన సమయంలో శరీర ఉష్ణోగ్రత 40లీజ ఎక్కువగా ఉంటుంది. అలాగే చర్మం పొడిగా, వేడిగా ఉంటుంది. తీవ్రమైన తలనొప్పి, కళ్లు తిరగడం, వికారం, గందరగోళం, హార్ట్‌బీట్ పెరగడం, పరిస్థితి విషమిస్తే వాంతులు, ఫిట్స్, స్పృహ కోల్పోవడం వంటి సమస్యలు సంభవించవచ్చు. మామూలుగా అయితే ఎండకు చెమట పడుతుంది. కానీ వడదెబ్బ తగిలితే శరీరం చెమట పట్టడం ఆగిపోతుంది. దీనివల్ల చర్మం పొడిగా మారి ఎర్రగా కనిపిస్తుంది.

నివారణ చిట్కాలు – హైడ్రేషన్ : వడదెబ్బ తగలకుండా ఎండాకాలంలో శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలి. ఆకలి వేయకపోయినా సరే రోజంతా నీళ్లు తాగుతూ ఉండాలి. పండ్లు, జ్యూస్‌లు, మజ్జిగ వంటివి తీసుకోవాలి. ముఖ్యంగా వేసవిలో చెమట రూపంలో శరీరాన్ని చల్లబరచడానికి నీరు సహాయపడుతుంది. తగినంత నీరు తాగితే ఏకాగ్రత పెరుగుతుంది. తలనొప్పి తగ్గుతుంది. నీళ్లు బాగా తాగితే చర్మం సైతం కాంతివంతంగా ఉంటుంది. వేసవి కాలంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండకు తిరగకుండా మరీ అవసరమైతే తప్ప బయటకు రాకుండా ఉండటం మంచిది. ఉదయం 6 గంటల నుంచి 10 గంటలలోపు పనులు ముగించుకోవాలి. దాహం వేసినప్పుడు మాత్రమే నీళ్లు తాగకుండా టైమ్ పెట్టుకుని ప్రతి గంటకు రెండు గ్లాసులు నీళ్లు తాగుతూ ఉండాలి.

వేసవి కాలంలో తేలికపాటి దుస్తులు ధరించడం మంచిది. వదులుగా ఉండే నూలు, లెనిన్ దుస్తులు ధరించడం మంచిది. లేత రంగులు తెలుపు, లైట్ బ్లూ, క్రీమ్, పింక్ వంటి కలర్స్ బట్టలు వేసుకోవాలి. నలుపు, ముదురు రంగులు వద్దు. బయటకు వెళ్లేటప్పుడు టోపీ, స్కార్ఫ్, సన్‌గ్లాస్, గొడుగు వంటివి పెట్టుకోవాలి. పాలిస్టర్, నైలాన్, సింథటిక్ బట్టలు వేసుకోకపోవడం మంచిది. వేసవి కాలంలో కెఫిన్ ఉండే టీ, కాఫీలు తీసుకోకపోవడం మంచిది. ఒకవేళ తీసుకున్నా చాలా తక్కువ తీసుకోవాలి. మద్యం తాగకపోవడం ఉత్తమం. అలాగే భోజనం కూడా భుక్తాయాసం వచ్చేలా చేయకూడదు. ఎక్కువ కారం, మసాలాలు, అధిక చక్కెరలు ఉండే ఆహార పదార్థాలు తీసుకోకపోవడం మంచిది. తేలికపాటి ఆహారం, సాత్వికాహారం, నీటి శాతం ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి.

Printed&published by on behalf (owner) Editor : GUNIPE SOBHAN BABU , Divya Publications, 4-160, DIWAN THOTA, PENUGUDURU, KAKINADA, ANDHRA PRADESH - 533016. printed at Rainbow printers ,6-84, SAIBABAPUNTHA ROAD, HUKUMPETA, RAJAHMUNDRY RURAL, EAST GODAVARI, ANDHRA PRADESH - 533107.RNI APBIL/26/A4072.email sobhangunipe@gmail.com.cell 9848899351.